నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | HYDERABAD



గ్రేటర్‌ను కమ్మేసిన మబ్బులు..

మరో రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గ్రేటర్ వ్యాప్తంగా మంగళవారం మబ్బు కమ్మేసింది. అక్కడక్కడ చినుకులు పడుతూ భారీ వర్షానికి ద్వారాలు తెరుస్తున్నట్టుగా వరదముంపు ప్రాంతాల ప్రజలను భయానికి గురి చేసింది. శని, ఆదివారాల్లో దంచి కొట్టిన వాన సోమ, మంగళవారం నాటికి తగ్గుముఖం పట్టినప్పటికీ నగరాన్ని మబ్బు మాత్రం వీడలేదు. కాగా ఇప్పటికే తీరం దాటిన వాయుగుండం అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, ఈ ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నగరానికి ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ అయ్యాయి.

కస్తూర్బాలో ముగ్గురు టీచర్లు సస్పెన్షన్

ఏడుగురు టీచర్ల బదిలీ

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 3: శంషాబాద్ మండలం పరిధిలోని పాలమాకుల కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో ఇటీవల జరిగిన పరిణామాలతో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మరో ఏడుగురు ఉపాధ్యాయులను ఇతర హాస్టల్స్‌కు పంపినట్లు చెప్పారు. బోధన ఉపాధ్యాయులతో పాటు బోధనేతర సిబ్బందిని బదిలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలమాకుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాను బోధించకపోవడంతో పాటు వారిని కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్‌వో మాధవి, టీచర్ ప్రశాంతి, ఏఎన్‌ఎం శాంతమ్మను సస్పెండ్ చేసినట్లు ఎంఈవో లక్ష్మణ్ నాయక్ తెలిపారు. మరో ఏడుగురిని ఇతర పాఠశాలలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ హాస్టల్‌ను 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. విద్యార్థులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగడంతో అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా సహకరిస్తామని హామీ ఇచ్చిన మూడు రోజులకే ఉపాధ్యాయులపై చర్యలు మొదలయ్యాయి.

ఖమ్మం ఘటనపై మాగంటి ఆగ్రహం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): ఖమ్మం వరద బాధితులకు సాయం చేసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్రంగా ఖండించారు. మూడు రోజులుగా జిల్లాలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకోవడంలో దారుణంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును అక్కడి ప్రజలు ఎండగడుతున్నారని, బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ నేతలు వరద ప్రాంతాల్లో నిత్యావసరాలు పంపిణీ చేస్తుంటే కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గు చేటు అని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయాలు పక్కన పెట్టిన ప్రతిపక్ష పార్టీలు బాధితులకు సహాయం అందించాలని సూచిస్తుంటే, సాయం చేసేందుకు వచ్చిన వారిపై దాడికి పాల్పడిన ఘటన ఆ పార్టీ నేతల వైఖరిని బయట పెట్టిందన్నారు. వరదల కారణంగా జనం ఇక్కట్లు పడుతుంటే 36 గంటల దాకా చోద్యం చూసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు వెళ్లి జిల్లాలో చేస్తున్న హడావిడిని ప్రజలు గమనిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వరదల కారణంగా నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు మాత్రం ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటన చేయడం ఏమిటని ప్రశ్నించారు. తొమ్మిది నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంకా మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల గురించి మాట్లాడటం చూస్తుంటే నవ్వొస్తుందన్నారు. కష్టాల్లో ఉన్న ఖమ్మం ప్రజానికానికి భరోసా ఇవ్వడం మానేసి భయభ్రాంతులకు గురి చేయడం కాంగ్రెస్ పార్టీకి తగదని, ఇలాంటి దాడులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదని హెచ్చరించారు. ఖమ్మంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తల పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మాగంటి గోపీనాథ్ డిమాండ్ చేశారు.

నాలాల అభివృద్ధికి కృషి చేసిన

ఇంజినీర్లకు అభినందనలు

ఎస్ఎన్‌డీపీతోనే వరద ముప్పు తప్పింది • ఎక్స్ వేదికగా గుర్తు చేసిన కేటీఆర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టులు నిర్మించడంతోనే.. గ్రేటర్‌లోని 175 కాలనీలకు పైగా వరద గండం తప్పిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో 2020 అక్టోబర్‌లో వచ్చిన వరదల కారణంగా జరిగిన నష్టాన్ని చూసిన తర్వాత మళ్లీ అటువంటి పరిస్థితి రావొద్దన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఎన్‌డీపీ) కార్యక్రమాన్ని చేపట్టిందని కేటీఆర్ మంగళవారం 'ఎక్స్' వేదికగా వివరించారు. ముఖ్యంగా 40 లక్షల మంది నివసించే ఓల్డ్ సిటీలో ప్రత్యేకంగా నాలాలను బాగు చేసే కార్యక్రమాన్ని తీసుకుందని తెలిపారు. ఆనాటి చర్యల ఫలితంగా నగరంలోని చారిత్రక ఓల్డ్ సిటీలో వరద ప్రభావిత ప్రాంతాలకు ముంపు ముప్పు తప్పిందని కేటీఆర్ పేర్కొన్నారు. వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా చేపట్టిన చర్యలతో ఇంత భారీ వర్షం పడినా సరే ఓల్డ్ సిటీలో ఎలాంటి సమస్యలు లేకపోవడం విశేషమని కేటీఆర్ అన్నారు. నాటి ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా నాలాల బాగుకోసం అవిశ్రాంతంగా శ్రమించిన అప్పటి చీఫ్ ఇంజినీర్లు జియావుద్దీన్, కిషన్ నాయక్, వసంత్ , ఈఎన్సీ శ్రీధర్‌లకు కేటీఆర్ ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నీటి శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

పొంచి ఉన్న కలుషిత నీటి ముప్పు

సరఫరా కాకుండా మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ

8.80 లక్షల క్లోరిన్ బిళ్లలు పంపిణీ

తాగునీటి నాణ్యతను పరీక్షించిన ఎండీ అశోక్ రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): భారీ వర్షాల నేపథ్యలో తాగునీటి నాణ్యతపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. కలుషిత నీటి ముప్పు పొంచి ఉన్న తరుణంలో జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అవలంభిస్తున్నామని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. నీటి ద్వారా ప్రబలే వ్యాధుల నివారణ, క్లోరిన్ బిల్లలను ఉపయోగించి నీటిని ఎలా శుద్ధి చేసుకోవాలనే విషయంపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రెండో రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. శేరిలింగంపల్లి హఫీజ్‌పేట్‌లోని సాయినగర్, యూత్ కాలనీ, మజీద్ బండ, ఇజ్జత్ నగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. తాగునీటి సరఫరాలో రెట్టింపు సంఖ్యలో శాంపిళ్లు సేకరించి పరీక్షించిన తర్వాత సరఫరా చేయాలన్నారు. క్లోరిన్ సైతం తగిన మోతాదులో ఉండాలని, అవసరమైన ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు.మ్యాన్‌హోల్స్ ఉప్పొంగితే వెంటనే పూడిక తీయించాలని, వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. మంచి నీటి పైపు నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

క్లోరిన్ బిళ్లలు పంపిణీ..

తాగునీటిని మూడంచెల పద్ధతిలో క్లోరినేషన్ ప్రక్రియ చేసిన తరువాతే ప్రజలకు సరఫరా చేస్తున్నామని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఇళ్లలో నిల్వ చేసిన నీటిని శుద్ధి చేసుకోవడానికి క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, బస్తీలు, లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటివరకు 8.80 లక్షల క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేశామని తెలిపారు. అలాగే కలుషిత నీరు, ఇతర సమస్యలకు జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో వాటర్ లాగింగ్ పాయింట్లు, ఓవర్ ఫ్లో, కలుషిత నీరు తదితర అంశాలను పర్యవేక్షించడానికి ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉన్న అధికారులు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయనున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాలను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రంగారెడ్డి కలెక్టర్ శశాంకతో కలిసి మంగళవారం పరిశీలించారు. మరో వర్షం పడితే హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిగా నిండిపోతుందని చెప్పారు. జలాశయం నిండితే దిగువ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. మరో 5వేల క్యూసెక్కులు వస్తే జలాశయం నిండి ఓవర్ ఫ్లో అవుతుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్లకుండా నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. మంత్రి వెంట ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, బండ్లగూడ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ ఉన్నారు.

జంట జలాశయాలకు తగ్గిన వరద..

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో వర్షం ప్రభావం తగ్గడంతో జలాశయాల్లోకి వరద నీరు తగ్గింది. ఉస్మాన్‌సాగర్‌కు 800, హిమాయత్‌సాగర్‌కు 400 క్యూసెక్కుల నీరు చేరుతుంది. అయితే ఉస్మాన్‌సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా..1785.55 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయి. హిమాయత్ సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా.. 1759.80 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. కాగా జంట జలాశయాలను చూసేందుకు సందర్శకులు భారీగా వస్తున్నారు.

గ్రేటర్ ప్రజలకు ప్రయాణం మరింత సులభం చేసేందుకు మెట్రోను తీసుకొచ్చారు. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ప్రయాణికులతో మెట్రో రైలు కిక్కిరిసింది. మెట్రో సౌకర్యంగా లేదని.. తోసుకుంటూ ఎక్కుతున్నామని.. కనీసం నిలబడటానికి కూడా చాలా ఇబ్బందులు పడ్డామని ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ మెట్రోలో ఎనిమిది కోచ్‌లుంటే.. మన హైదరాబాద్‌లో మెట్రో రైలును మూడు కోచ్‌లకే ఎందుకు పరిమితం చేశారంటూ ప్రయాణికులు ఎల్ అండ్ టీని ప్రశ్నించారు. రద్దీగా ఉన్న సమయంలో మెట్రో రైళ్ల లో ఇరుక్కొని ప్రయాణం చేస్తున్న ఫొటోలను నేరుగా సోషల్ మీడియా ద్వారా ఎల్ అండ్ టీ మెట్రో, సీఎంఓలకు పోస్టు చేసినా ఫలితం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అదనపు మెట్రో కోచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మెట్రోపై గరం గరం

కిక్కిరిసిన రద్దీతో ప్రయాణికుల ఇబ్బందులు

రద్దీ సమయంలో ఒకసారి మాతోపాటు ప్రయాణించి చూడండి

ఢిల్లీ మెట్రోలో 8 కోచ్‌లు..

నగర మెట్రో 3 కోచ్‌లకే పరిమితం ఎందుకు ?

ఎల్ అండ్ టీని ప్రశ్నిస్తున్న మెట్రో ప్రయాణికులు

సోషల్ మీడియా వేదికగా మెట్రో తీరుపై మండిపాటు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కిక్కిరిసిన రద్దీతో హైదరాబాద్ మెట్రో సౌకర్యవంతంగా లేదు...ట్వీట్ చేసిన ఓ మెట్రో ప్రయాణికుడు. ఒక్కసారి రద్దీ సమయంలో మాతోపాటు ప్రయాణించి చూడండి. మరో ప్రయాణికుడి ఘాటైన ట్వీట్... ఢిల్లీ మెట్రోలో 8 కోచ్‌లు... మరీ హైదరాబాద్ మెట్రో 3 కోచ్‌లకే ఎందుకు పరిమితం చేశారు.? ఇలా మెట్రో ప్రయాణికులు ఎల్ అండ్ టీ మెట్రోను నిత్యం సోషల్ మీడియా వేదికగా ట్వీట్లతో ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్‌లో ప్రజా రవాణా వ్యవస్థలో కచ్చితమైన సమయానికి గమ్య స్థానానికి చేర్చేలా మెట్రో రైలు ప్రయాణం నగర వాసులకు అందుబాటులో ఉంది. నగరం ఒక చివర నుంచి మరో చివరకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతుంది. గంటలోపే గమ్య స్థానానికి చేరుస్తుందని మెట్రోను ఆశ్రయిస్తున్న నగర వాసులకు మెట్రో ప్రయాణం తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆర్టీసీ సిటీ బస్సుల్లో ఉండే రద్దీని మించి మెట్రో రైళ్లలో ఉండటంతో నిలబడటానికి కూడా స్థలం లేదు. మెట్రో రైలు ఎక్కే సమయంలోనూ తోసుకుంటూ ఎక్కాల్సి వస్తోందంటూ' మెట్రో కార్యకలాపాలపై ప్రయాణికులు గరం గరంగా ఉన్నారు. సోషల్ మీడియా వేదికగా మెట్రో సేవలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోని మెట్రో..

ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు గానీ, నిర్వహణ సంస్థ అయిన ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. రద్దీగా ఉన్న మెట్రో రైళ్లలోనే ఇరుక్కొని ప్రయాణం చేస్తున్న ఫొటోలను నేరుగా సోషల్ మీడియా ద్వారా ఎల్ అండ్ టీ మెట్రో, సీఎంఓలకు పోస్టు చేసినా ఫలితం ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచాల్సిన ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు మాత్రం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.

నిజాంపేట్-బాచుపల్లి రోడ్డులోని ఎస్ఆర్ కళాశాల భవనం

ఎస్ఆర్ కళాశాల సెల్లార్‌లోకి వరదనీరు

సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

నిరవధిక సెలవు ప్రకటించిన యాజమాన్యం

కళాశాల భవనం పత్తికుంట చెరువు బఫర్ జోన్‌లో ఉందన్న అధికారులు

దుండిగల్, సెప్టెంబర్ 3 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి-నిజాంపేట్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్ఆర్ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాల భవనం సెల్లార్‌లోకి సోమవారం అర్ధరాత్రి వరదనీరు చేరింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 500 మంది వరకు చదువుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలతో వరదనీరు సెల్లార్‌లోకి చేరింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌చార్జి అధికారి సుకృత, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతి, బాచుపల్లి పోలీసులతో పాటు వివిధ విభాగాల అధికారులు కళాశాలకు చేరుకుని పరిశీలించారు. సెల్లార్‌ను డైనింగ్‌గా వినియోగించడం చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. సెల్లార్‌లోకి అధికంగా నీరు చేరడం, ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనం పిల్లర్లు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అధికారులు కళాశాల సెల్లార్‌ను సీజ్ చేశారు. విద్యార్థులను ఖాళీ చేయించి పక్కనే ఉన్న ఫంక్షన్‌హాల్‌లో బస చేయించారు. మంగళవారం నుంచి కళాశాల యాజమాన్యం నిరవధిక సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోయారు.

బఫర్‌జోన్‌లో నిర్మాణం..

పత్తికుంట చెరువు బఫర్‌జోన్‌లో పంచాయతీ అనుమతులతో నిర్మించిన ఈ భవనంపై మొదటి నుంచి వివాదాలు ఉన్నాయి. అనుమతులు లేకుండానే సెల్లార్ నిర్మాణం, జీ+2కు అనుమతులు పొంది జీ+4 నిర్మించడంతో క్లియరెన్స్ రాకపోవడంతో కొంతకాలం ఖాళీగా ఉంది. ఏడాదిన్నర కాలంగా ఇందులో ఎస్ఆర్.జూనియర్ కళాశాల పేరుతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాలను అధికారులు సీజ్ చేయగా విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది.

హైడ్రాకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ మహిళా నేత

బాచుపల్లిలోని పత్తికుంట చెరువు ఎఫ్‌టీఎల్/బఫర్‌జోన్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలు తొలగించి చెరువును కాపాడాలని మంగళవారం హైడ్రా కమిషనర్‌ను నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేత రమణి మల్యాల కోరారు. 10 ఎకరాల్లో విస్తరించిన చెరువులో నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురైందని, అందులో ఎస్ఆర్ కళాశాల, శ్రీరామ్ బిజినెస్ స్కూల్ భవనాలు, సప్తపది ఫంక్షన్ హాల్ వంటివి ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయని ఆమె ఆరోపించారు.

మున్సిపాలిటీల్లో శివారు గ్రామాల విలీనం

13 మున్సిపాలిటీల్లో 51 గ్రామ పంచాయతీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. గ్రేటర్ చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు ఈ విలీనం జాబితాలో ఉన్నాయి. మూడు జిల్లాల పరిధిలోని 13 మున్సిపాలిటీల్లో 51 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. నిబంధనల ప్రకారం ఓఆర్ఆర్ వెలుపల ఉన్న గ్రామాలను విలీనం చేయకూడదు. కాగా విలీనం చేసిన ఆ గ్రామాలు, ప్రాంతాలు పట్టణీకరణ చెందుతుండటంతో విలీనం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. ఓఆర్ఆర్ వెలుపల ఉన్న ఇతర గ్రామాల ప్రజలు సైతం డిమాండ్ చేస్తే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయన్న అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. అలాంటి డిమాండ్ వస్తే ఔటర్ బయట ఉన్న వాటిని మళ్లీ నగర పంచాయతీలుగా పరిగణించాలని భావిస్తున్నారు. కాగా ఇదంతా జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీలను కలిపేందుకే గ్రామాలను ముందుగా సమీప మున్సిపాలిటీల్లో గ్రామాలను విలీనం చేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఓఆర్ఆర్ లోపల ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్‌లతో పాటు పలు మున్సిపాలిటీలు ఓఆర్ఆర్ లోపల ఉన్నాయి. కొత్తగా విలీనం చేసిన గ్రామాలన్నీ 13 మున్సిపాలిటీల పరిధిలో ఉన్నాయి.

33 గ్రామాలపై అయోమయం..

మేడ్చల్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో విలీనంపై 28 గ్రామాలకు చెందిన ప్రజలు ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయం విదితమే. మంగళవారం ప్రభుత్వం జిల్లాలోని 28 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. జీహెచ్ఎంసీ పరిధితో పాటు 61 గ్రామపంచాయతీలతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాగా ఏర్పడింది.అయితే 61 గ్రామాలకు గాను 28 గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం కానున్న నేపథ్యంలో మిగతా 33 గ్రామాల పరిస్థితి ఏమిటన్నది అగమ్యగోచరంగా మారింది.

మున్సిపాలిటీలు	విలీనం అయ్యే గ్రామ పంచాయతీలు
పెద్ద అంబర్‌పేట	బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట
శంషాబాద్	బహుదూర్‌గూడ, పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాంసీమియాగూడ
నార్సింగి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ
మేడ్చల్	పూడూరు, రాయిలాపూర్
దమ్మాయిగూడ	కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి
నాగారం	బోగారం, గోధుమకుంట, కలీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు
పోచారం	వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచవానిసింగారం, చౌదరిగూడ
ఘట్‌కేసర్	అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఎదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ
గుండ్లపోచంపల్లి	మునీరాబాద్, గౌడవెల్లి
తూంకుంట	బొంరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ
తెల్లాపూర్	కర్ధనూర్, ముత్తంగి,పోచారం, పాటి, ఘనపూర్
అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దయారా, కిష్టారెడ్డిపేట్, సుల్తాన్‌పూర్

జీతాలివ్వని ఐటీ కంపెనీ



మాదాపూర్, సెప్టెంబర్ 3: ఉద్యోగులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించిన ఐటీ కంపెనీపై బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మాదాపూర్ మైండ్ స్పేస్‌లోని బ్రెయిన్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇందులో 2500 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా అందులో 1500 మంది ఉద్యోగులకు మూడు నెలల పాటు జీతాలు ఇవ్వకుండా ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే కంపెనీ యాజమాన్యం వారిని ఉద్యోగంలో నుంచి తొలగించింది. దీంతో బాధితులు మంగళవారం మాదాపూర్ పోలీసులను ఆశ్రయించగా వారు ఈఓడబ్ల్యూలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఈఓడబ్ల్యూ (ఎకానమిక్ అఫెన్సిస్ వింగ్)లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అనంతరం ఉద్యోగులు రంగారెడ్డి జిల్లా లేబర్ జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.